# సాధికారిత సాధించాలి

■ రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి
■ ఘనంగా మహిళా దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

ఆదిబట్ల, మార్చి 7: మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించినప్పుడే నిజమైన మహిళా దినోత్సవమని రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంతో జిల్లా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఉమెన్, చైల్డ్ వెల్ఫేర్ శాఖ, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మార్పు అనేది ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నారు. స్త్రీ, పురుషులిద్దరూ బండికి జొడెద్దులాగా ప్రయాణం చేస్తేనే సమాజంలో ముందుకెళ్తారన్నారు. కుటుంబానికి మూలం మహిళ అని, ప్రతి విషయంలో ఆమె సమతుల్యత కలిగి ఉండాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో నేటికీ మహిళలను తక్కువగా చూస్తున్నారని, ఇప్పుడిప్పుడే వారికి చదువు, ఆర్థిక పరంగా పలు విషయాల్లో సమాన అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఉద్యోగులుగా 1/3 వంతు మహిళలు పని చేస్తున్నారని తెలిపారు.

**తమను తాము సమర్థించుకోవాలి**

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. మహిళలు తమను తాము సమర్థించుకోవాలన్నారు. అణిచివేతను తట్టుకుని ముందుకు సాగాలన్నారు. మహిళలు.. సమస్యల పరిష్కారం కోసం కాకుండా.. వాటిని పరిష్కరించే స్థాయికి ఎదగాలన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలపై చైతన్యం పెంపొందించేందుకు జిల్లా స్థాయిలో శిబిరాలను నిర్వహించి మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకు రావాలన్నారు. అనంతరం కలెక్టర్ మహిళా ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్వో సంగీత, టీజీవో జిల్లా అధ్యక్షుడు రామారావు, ఉమెన్ అండ్ చైల్డ్‌వెల్ఫేర్ జిల్లా అధికారిణి సంధ్యారాణి, సీడీపీవో శాంతిశ్రీ, టీజీవో నేతలు రేవతి, అలివేలు, మహేశ్వరి, అనిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పూర్తి చేయాలి

ఆదిబట్ల, మార్చి 07: ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరిత గతిన పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ, నీటి ఎద్దడి నివారణ, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల గ్రౌండింగ్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా కార్యాచరణ రూపొందించాలన్నారు. నిరంతరం నీటిని అందించేందుకు ప్రణాళిక ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్యను అధిగమించడానికి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మిషన్ భగీరథ గ్రిడ్ ఇంట్రా పనులను మార్చి 15వరకు గ్రౌండింగ్ చేపట్టి 20వరకు పనులు పెండింగ్‌లో లేకుండా పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి, అర్హులకు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, మిషన్ భగీరథ ఈఈ రాజేశ్వర్, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత గుత్తాజ్వాల

# మహిళలను ప్రోత్సహించాలి

■ ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత గుత్తాజ్వాల
■ కలెక్టరేట్‌లో మహిళా దినోత్సవం ■ పలు రకాల పోటీలు
■ విజేతలకు బహుమతులు అందజేత

వికారాబాద్, మార్చి 7: మహిళలను ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత గుత్తాజ్వాల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో టీజీవో జిల్లా కమిటీ, మహిళా, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. మహిళలకు సమాజంతో పాటు హక్కులపై అవగాహన ఉండాలన్నారు. విద్యను అభ్యసించడంతో పాటు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో మంచి చెడులను గ్రహిస్తూ సమాజంలో తోటి వారిని, కుటుంబాల్లో మంచి మార్పులు తీసుకొచ్చేలా ప్రయత్నించాలని సూచించారు.

**అమ్మే.. నా మొదటి గురువు**

అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ... నా జీవితంలో నాకు మొదటి గురువు మా అమ్మే అన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో రూపొందించిన విధంగా సమాజంలో అసమానతలకు గురికాకుండా, మహిళలను సమాన దృష్టితో చూడాలని తెలిపారు. జిల్లా యంత్రాంగంలో మహిళా ఉద్యోగులు తమకు అప్పజెప్పిన పనులను సక్రమంగా నిర్వహిస్తున్నారని, విధుల నిర్వహణలో అంకితభావంతో పని చేస్తున్నారని తెలిపారు.

**రక్తదాన శిబిరం**

జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి, వైస్ చైర్మన్ డాక్టర్ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన వారిలో కలెక్టర్ సీసీ నరేందర్, డీపీఆర్వో సిబ్బంది సతీశ్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు. బొంరాస్‌పేట ఆశ్రమ పాఠశాల మహిళా ఉపాధ్యాయులు చేసిన బంజార నృత్యం, భరత నాట్యం చూపరులను ఆకట్టుకుంది. అనంతరం క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా క్రీడాకారులకు, కలెక్టరేట్, మున్సిపల్, రెవెన్యూ, విద్య, వైద్య, పోలీస్ మహిళా సిబ్బంది, అంగన్‌వాడీ, మహిళా సంఘాల సభ్యులకు బహుమతులను అందజేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన రంగోలి, మ్యూజికల్ చైర్, చెస్ పోటీలో పాల్గొన్న విజేతలకు బహుమతులు, రక్తదానం చేసిన సిబ్బందికి అతిథులు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ వెంకటేశ్, డీపీవో జయసుధ, డీపీఆర్వో చెన్నమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో రాణిస్తూ... స్వశక్తితో ముందుకు సాగాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం, మార్చి 7 : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ... స్వశక్తితో ముందుకు సాగాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ.. నేటి సమాజంలో ప్రభుత్వాలు మహిళలకు అన్ని రకాలుగా అండగా ఉంటున్నాయన్నారు. మహిళల కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చాయని వాటిని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం మహిళా అధ్యాపకులు డీసీపీని సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ హెచ్ఎస్ సైనీ, కళాశాల అధ్యాపకులు నాగరాజు, శీతల్, గీతాత్రిపాఠి, రేణుక, విజయలక్ష్మి, శ్రీనాథ్‌రెడ్డి, సంజీవ, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ ధాన్యం త్వరగా అందజేయాలి


రైస్‌మిల్లులో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పరిగి, మార్చి 7 : 2024-25 సంవత్సరానికి సంబంధించిన సీఎంఆర్ ధాన్యాన్ని త్వరగా అందజేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ రైస్‌మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం పరిగి మండలం న్యూ ఇండియా రైస్‌మిల్, శ్రీ శివకృష్ణ రైస్‌మిల్లులను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరానికి సంబంధించి సీఎంఆర్ ధాన్యాన్ని సాధ్యమైనంత త్వరగా అందజేయాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్‌వో మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌కు కృతజ్ఞతలు


మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

కొడంగల్, మార్చి 7 : లగచర్ల భూములపై కోర్టు స్టే వచ్చిన సందర్భంగా బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు సురేశ్, సంత్రకుంటతండా మాజీ సర్పంచ్ రాజునాయక్ మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రిని లగచర్ల బాధితులు కలిశారు. ఈ సందర్భంగా లగచర్ల రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో ఎన్నో విధాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. కేసుల కారణంగా జైలు జీవితాన్ని అనుభవించినట్లు తెలిపారు. లగచర్ల ఘటన బాధితులు జైల్లో ఉన్న క్రమంలో మాజీ మంత్రి వెన్నంటి ఉండి ఎంతో సహాయ సహకారాలను అందించి రైతుకు భరోసాగా నిలిచినట్లు పేర్కొన్నారు. కోర్టు స్టే వచ్చేందుకు కూడా కృషి చేసిన సందర్భంగా లగచెర్ల రైతుల తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అలాగే మాజీ మంత్రి మాట్లాడుతూ.. ఇది రైతు విజయంగా పేర్కొన్నారు. రైతుల జోలికొస్తే ఏం జరుగుతుందో ప్రభుత్వానికి ఇదో చక్కటి గుణపాఠమన్నారు. రైతుల వెంట ఉండి పోరాడిన సురేశ్‌కు బాసటగా నిలిచిన మాజీ సర్పంచ్ రాజునాయక్‌ను ఆమె అభినంధించారు. రైతులు జైల్లో ఉన్నప్పుడు నరసింహానాయక్ బాధిత రైతులకు అండగా నిలిచి వారి కష్టాల్లో పాలుపంచుకొన్నారని ఇందుకు ప్రత్యేకంగా అభినందించారు.

## శీతలీకరణ గదుల్లో కూరగాయలు భద్రపర్చుకోవాలి


సురంగల్‌లో శీతలీకరణ గదిని ప్రారంభిస్తున్న కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసత్యనారాయణరెడ్డి

మొయినాబాద్, మార్చి 7: గ్రామాల్లోని సన్నకారు రైతులు పండించిన కూరగాయలకు మద్దతు ధర లభించే వరకు సహజ సిద్ధమైన శీతలీకరణ గదుల్లో భద్రపర్చుకోవచ్చని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసత్యనారాయణరెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ రోహిత్‌కందకట్ల సహకారంతో సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ హెడ్ సంయుక్తపెంటా, లింగం సురంగల్ గ్రామంలో ఆకు కూరలు, కాయగూరలను నిల్వ చేయడానికి ఏర్పాటు చేసిన శీతలీకరణ గదులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు మద్దతు ధరలేని సమయంలో మార్కెట్‌కు వెళ్లి విక్రయస్తే నష్టపోయే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి సమయంలో సన్నకారు రైతులు నష్టపోకుండా మద్దతు ధర వచ్చే వరకు శీతలీకరణ గదులను వినియోగించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పల్లె సృజన సంస్థ అధ్యక్షుడు బ్రిగేడియర్ గణేశం, తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ మెరాజ్ ఫహీమ్, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, ఉపసర్పంచ్ గడ్డం అంజిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు గడ్డం వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, భాస్కర్, విక్రంరెడ్డి, నర్సింహాగౌడ్, సీనియర్ నాయకులు ఈగ రవీందర్‌రెడ్డి, శేఖర్, గౌతంరెడ్డి, అశోక్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయల ఉత్పత్తిని పెంపొందించాలి

● రైతు కమిషన్ రాష్ట్ర చైర్మన్ కోదండరెడ్డి
● యాచారంలో రైతులతో ముఖాముఖి సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

యాచారం, మార్చి 7 : రైతులు కూరగాయలు, ఆకుకూరల ఉత్పత్తిని పెంపొందించాలని రైతు కమిషన్ రాష్ట్ర చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం వ్యవసాయ, సంక్షేమ కమిషన్ ఆధ్వర్యంలో రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ, చౌదర్‌పల్లి, మొండిగౌరెల్లి గ్రామాలను ఉద్యాన పంటల సాగుపై పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఆయా గ్రామాల రైతులతో అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్కువ నీటితో సాగు చేసే కూరగాయలు, ఆకుకూరల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కూరగాయలు, ఆకుకూరల సాగులో సమస్యలు, యాంత్రీకరణ, కోతుల నివారణ చర్యలు, ట్రాన్స్‌పోర్టేషన్, నూతన వంగడాలు, నారు, విత్తనాల లభ్యత, డ్రిప్, స్ప్రింక్లర్లపై సబ్సిడీలు, కోల్డ్ స్టోరేజి యూనిట్లు, గోదాములు తదితర అంశాలపై రైతులతో చర్చించారు. వ్యవసాయ, ఉద్యాన. పట్టు పరిశ్రమ అధికారులు వివిధ రకాల ప్రదర్శనలను ప్రదర్శించి వాటిపై రైతులకు అవగాహన కల్పించారు.

**తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి**

ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో సాగునీటి ఎద్దడి దృష్ట్యా రైతులు తక్కువ నీటితో సాగు చేసుకునే కూరగాయలు, ఆకుకూరల సాగుపై దృష్టి సారించాలన్నారు. అలాగే తక్కువ పెట్టుబడితో తక్కువ శ్రమతో అధిక పంట దిగుబడితో లాభాలు ఆర్జించవచ్చన్నారు. రాష్ట్రంలోనే మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద మూడు గ్రామాలను ఎంపిక చేసినట్లు సూచించారు. ఆయా గ్రామాల రైతులు కూరగాయలు, ఆకుకూరలను ఆధునిక పద్ధతులతో సాగు చేయాలని సూచించారు. రైతులు ఆయా శాఖల అధికారులను సంప్రదించి తగిన సలహాలు, సూచనలు పాటించి పంటల సాగు ఉత్పత్తిని రెట్టింపు చేయాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పైలెట్ ప్రాజెక్టు విజయవంతమయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, రైతు కమిషన్ సభ్యులు రాములు నాయక్, భూమి సునీల్, గోపాల్ రెడ్డి, గంగాదర్, నర్సింహారెడ్డి, వెం కన్న యాదవ్ భవాని, కమిషన్ కార్యాలయ కార్యదర్శి సంధ్యారాణి, జిల్లా వ్యవసాయాధికారిణి సుజాత, సహాయ వ్యవసాయ సంచాలకుడు హరి వెంకట ప్రసాద్, మండల వ్యవసాయాధికారి రవినాథ్, హార్టికల్చర్ అధికారిణి నవీన, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు ఉన్నారు.


# 250 మంది గైర్హాజర్

● సజావుగా ఇంటర్ పరీక్షలు
● 8,392 మంది విద్యార్థులకు 8142 మంది హాజరు

వికారాబాద్, మార్చి 6 : జిల్లాలో శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష పేపర్ సజావుగా జరిగింది. మొత్తం 8,392 మంది విద్యార్థులకు 8142 మంది హాజరయ్యారు. 250 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకున్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 29 కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 6,796 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 6,643 మంది పరీక్షలు రాశారు. 153 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,596 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 1,499 మంది రాశారు. 97 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి తెలిపారు.

# అనుమతులు లేకుంటే చర్యలు తప్పవు

❍ జిల్లా ఉప వైద్యాధికారి నాగేంద్రబాబు ❍ శంకర్‌పల్లిలో పలు దవాఖానల తనిఖీ


శంకర్‌పల్లిలోని ఓ ప్రైవేట్ దవాఖానను తనిఖీ చేస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి నాగేంద్రబాబు

చేవెళ్ల రూరల్, మార్చి 7 : ప్రైవేట్ దవాఖానలు అనుమతులు లేకుండా నడిపితే చర్యలు తప్పవని జిల్లా ఉప వైద్యాధికారి నాగేంద్రబాబు అన్నారు. శంకర్‌పల్లిలోని పలు ప్రైవేట్ దవాఖానలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ దవాఖానల యాజమాన్యాలు పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ కింద నియమ, నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. అన్ని దవాఖానల్లో తప్పనిసరిగా పీసీ పీఎన్‌డీటీ బోర్డులు ఏర్పాటు చేయించాలని సూచించారు. ఆయన వెంట వైద్యులు అనూష, శోభారాణి, శ్రీనివాస్, బాబు రెడ్డి, మన్సూర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక అభివృద్ధి రంగాల్లో సృజనాత్మక దృక్పథం ఉండాలి



కేజీరెడ్డి కళాశాలలో సదస్సులో సావనీరును ఆవిష్కరిస్తున్న తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకృష్ణారెడ్డి

మొయినాబాద్, మార్చి 7 : ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు సాంకేతిక రంగాల్లో సృజనాత్మక దృక్పథం కలిగి ఉండాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో తెలంగాణ ఇన్నోవేషన్ విభాగం సహకారంతో 2వ అంతర్జాతీయ అంగీకృత పరిశోధన, సుస్థిర అభివృద్ధి సదస్సు-2025 శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుముఖ పరిశోధనలను విద్యా వ్యవస్థలో జోడించాలని.. అందుకోసం విద్యార్థులు, విద్యావేత్తలు, సామాజిక వేత్తల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో సింగాపూర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఉపకులపతి రామూర్తి, గ్రేట్ కళాశాల డీన్ స్వదేశ్ కుమార్‌సింగ్, కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్ రోహిత్‌కందకట్ల, ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి, అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యువత క్రీడల్లోనూ రాణించాలి

కేంద్ర యువజన, క్రీడ, కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ


సదస్సులో పాల్గొన్న కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

నందిగామ, మార్చి 7 : యువత చదువుతో పాటు క్రీడాలోన్లూ రాణించాలని కేంద్ర యువజన, క్రీడ, కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హాశాంతివనంలో శుక్రవారం జాతీయ క్రీడా చింతన్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాండవీయ, కేంద్ర యువజన క్రీడా వ్యవహారాల సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖాడ్సే, దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతల ప్రతినిధులతో సమవేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ.. ప్రపంచ క్రీడల వైపు భారత్ అడుగులు వేస్తున్నదని, 2026లో జరిగే ఒలంపిక్స్ క్రీడాల్లో భారత క్రీడకారులు సత్తా చాటేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో క్రీడాకారులను సిద్ధం చేయాలన్నారు. క్రీడారులకు అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు. 2036లో భారత్‌లో ఒలంపిక్స్ క్రీడాలు నిర్వహించేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు

దోమ, మార్చి 7 : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తిని ఫోన్ సిగ్నల్ ద్వారా పోలీసులు కాపాడారు. ఈ ఘటన దోమ మండల పరిదిలోని పాలేపల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పరిగి ఎస్సై సంతోశ్‌కుమార్, దోమ పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన తుప్పలి రవి(37) ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ సభ్యులతో గొడవపడి గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఓ గుట్టలోకి వెళ్లి క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యా చేసుకుంటున్నానని భార్యకు కాల్ చేశాడు. అలర్ట్ అయిన కుటుంబ సభ్యులు వెంటనే దోమ పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆ వ్యక్తి వాడుతున్న ఫోన్ కాల్ సిగ్నల్ ఆధారంగా పరిగి ఎస్సై సంతోశ్‌కుమార్, దోమ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని పరిగి ప్రభుత్వ దవాఖానకు తరలించి వైద్యం అందించారు. అనంతరం అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు.

# 52 కిలోల గంజాయి పట్టివేత

● ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు
● గంజాయి, కారు, 4 ఫోన్లు స్వాధీనం

చేవెళ్ల రూరల్, మార్చి 7 : అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న నిందితులను మోకిలా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. మోకిలా సీఐ వీరబాబు తెలిపిన వివరాలు.. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో నాగపూర్ వైపు కారులో గంజాయి తరలిస్తున్నట్లు గురువారం రాత్రి 9 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందడంతో వారు 11.30 గంటలకు ఇంద్రారెడ్డినగర్ వద్దకు చేరుకున్నారు. 12.40 గంటలకు కారును ఆపి తనిఖీ చేయగా.. డిక్కీలో 52 కిలోల గంజాయి (26 ప్యాకెట్లు, ఒక్కొక్కటి 2 కిలోలు) దొరికింది. వెంటనే కారులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని గంజాయి, కారు, 4 ఫోన్లను సీజ్ చేసి పీఎస్‌కు తీసుకెళ్లారు. విచారణలో భాగంగా నల్గొండ జిల్లా చందంపేట మండలం బొల్లారం గ్రామానికి చెందిన, సైదరాబాద్‌లోని సింగరేణి కాలనీలో నివాసం ఉంటున్న రామవత్ మత్రు అలియాస్ భవాని నాయక్ (35), మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ పరిధిలోని జామ్ ఖేడ్ అరోరా బస్తీ జోపడ్ పట్టికి చెందిన నీలేశ్ బాబన్ కాలే అలియాస్ లాల్యా (22), చందంపేట మండలం బొల్లారానికి చెందిన నేనవత్ తేజ(29)గా గుర్తించారు. వీరు మరో ముగ్గురితో కలిసి మార్చి 3న మోతుగూడెం (ఆంధ్రా, ఒడిశా సరిహద్దు) నుంచి గంజాయి తెచ్చుకున్నట్లు అంగీకరించారు. అక్కడి నుంచి సెప్టిక్ ట్యాంకర్ లో హైదరాబాద్‌కు తీసుకొచ్చామని, దానికి కారును పైలెట్ వాహనంగా ఉపయోగించామని చెప్పారు. పెద్ద అంబర్ పేట వద్ద తమ వాటాగా 26 ప్యాకెట్లను తీసుకొని నాగపూర్ లో అమ్మేందుకు తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. ఈ కేసులో ఏ1 గా ఉన్న రామవత్ మత్రు తన మిత్రులతో కలిసి మీర్‌పేట, ఇబ్రహీంపట్నం, నాచారం, డిండి, ఆర్‌సీ పురం పీఎస్ పరిధిలో పలు నేరాలు చేశాడని, మేడ్చల్, పటాన్‌చెరు, మలక్‌పేట, దేవరకొండ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. ముగ్గురిని అరెస్ట్ చేసి ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి.. దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీఐ వెల్లడించారు. మరో ముగ్గురిని కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు.